# హైమాస్ట్ లైట్ల ప్రారంభం




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్ :** మండలంలోని మలన్‌గొంది గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ప్రత్యేక సహకారంతో, రూ. 2 లక్షల సీఎస్ఆర్ నిధులతో గ్రామంలో మూడు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందని సింగిల్ విండో చైర్మన్ తెలిపారు. తమ గ్రామానికి లైట్లు మంజూరు చేయించి, ఏర్పాటుకు సహకరించినందుకు గ్రామస్తులు సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ , బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ కు శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సీత , ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పటేల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఘనంగా బక్రీద్ వేడుకలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ (ఈద్-ఉల్-జుహా) వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధాన ఈద్గాలు, మసీదులు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ముస్లిం సోదరులు కొత్త దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గాలకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మత పెద్దల సమక్షంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రార్థనల అనంతరం పేదలకు దానధర్మాలు చేయడం, ఖుర్బానీ కార్యక్రమాలను భక్తి భావంతో నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు భోజనాల్లో పాల్గొనడంతో జిల్లా వ్యాప్తంగా పండుగ సందడి నెలకొంది. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పలు ప్రాంతాల్లోని ఈద్గాలను సందర్శించి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలు




**ఉద్యమ కెరటం, వరంగల్:** నవయుగ వైతాళికుడు, ప్రముఖ చరిత్రకారుడు, జర్నలిస్టు, తెలంగాణ సాహిత్యాభివృద్ధికి విశేష సేవలందించిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి అధ్యాపకులు నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలుగు భాష, తెలంగాణ చరిత్ర, సాహిత్య రంగాలకు అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. కేయూ పాలక మండలి సభ్యులు, తెలుగు బీఓఎస్ చైర్మన్ డాక్టర్ చిర్ర రాజుగౌడ్, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ మామిడి లింగయ్య మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, భాషా వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన రచనలు నేటి తరానికి మార్గదర్శమని, సమాజ చైతన్యానికి దోహదపడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ కర్రె సదాశివ్, డాక్టర్ బానోత్ స్వామి, డాక్టర్ నాగరాజు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్‌కు మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**ఉద్యమకెరటం,ఆసిఫాబాద్:** ముస్లిం సోదర సోదరీమణుల పవిత్ర పండుగ బక్రీద్ సందర్భంగా ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రజలకు శాసనసభ్యురాలు కోవ లక్ష్మి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్ కి ఎమ్మెల్యే కోవ లక్ష్మి మిఠాయిలు తినిపించి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ త్యాగానికి, భక్తికి, కరుణకు ప్రతీక బక్రీద్ పండుగ అని, సమాజంలో అందరూ కలిసిమెలిసి, సోదరభావంతో జీవించాలనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వికసించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, ఆసిఫాబాద్ పార్టీ అధ్యక్షుడు జబోరే రవీందర్ , రెబ్బెన మాజీ జెడ్పీటీసీ బాపురావు , నాయకులు సాయి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ, త్యాగానికి ప్రతీక బక్రీద్

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** హజ్రత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు తమ పలు సమస్యలపై ఎమ్మెల్యే నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగభావాన్ని పెంపొందించడమే బక్రీద్ పండుగ ముఖ్య సందేశమని పేర్కొన్నారు. త్యాగబుద్ధి, నిజమైన భక్తి భావం కలిగినవారే దైవ కృపకు పాత్రులవుతారని తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో సాటి మనిషిని ప్రేమించి, అవసరంలో ఉన్నవారికి సహాయం చేసే వారే నిజమైన మానవతావాదులని అన్నారు. హజ్రత్ ఇబ్రహీం చూపిన త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ పరస్పర ప్రేమాభిమానాలతో, సహృదయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అల్లాహ్ను ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక వ్యవహారంపై అసత్య ప్రచారాలు సహించేది లేదు





- తప్పుడు ప్రచారం చేసే మీడియా సంస్థలకు నోటీసులు పంపుతాం
- రాష్ట్ర మంత్రి సీతక్క

**ఉద్యమ కెరటం, ములుగు:** ఏటూరునాగారంలో ఓ మైనర్ బాలిక వ్యవహారానికి సంబంధించి కొందరు ప్రతిపక్ష నాయకులు, వ్యక్తులు, కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు సంబంధించిన వాస్తవాలను పోలీసులు, మహిళా-శిశు సంక్షేమ శాఖ అధికారులు నిర్వహించిన దర్యాప్తు ఆధారంగా ప్రజల ముందు ఉంచేందుకు గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విచారణ వివరాలు వెల్లడించేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేస్తే కొందరు మీడియా ప్రతినిధులు దానిని బహిష్కరించి నిరసన తెలపడం విచారకరమని అన్నారు. ఒక కాంగ్రెస్ నాయకురాలి కుమారుడిపై ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేసినప్పుడు రోడ్డెక్కి నిరసన చేయాల్సింది తాము కాదని, ఇప్పుడు కొందరు మీడియా సంస్థలు మాత్రం దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కొన్ని మీడియా సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీపై తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నాయని మండిపడ్డారు. రేటింగ్స్ కోసం ఒక మైనర్ బాలిక జీవితంతో చెలగాటమాడటం తీవ్రంగా బాధాకరమని పేర్కొన్నారు. ఈ దుష్ప్రచారం కారణంగా బాలిక కుటుంబం తీవ్ర మానసిక వేదనకు గురవుతోందని తెలిపారు. ఆరోపణలు చేస్తున్నవారి వద్ద నిజమైన ఆధారాలు ఉంటే పోలీసులకు సమర్పించాలని సవాల్ విసిరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు కథనాలు ప్రసారం చేసే మీడియా సంస్థలకు లీగల్ నోటీసులు పంపుతామని హెచ్చరించారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్‌ను పురస్కరించుకుని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు ఉబెద్ బిన్ యాహియా (తారిక్) ఆహ్వానం మేరకు ఆసిఫాబాద్ పట్టణంలోని ఆయన నివాసానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇంచార్జి శ్యాంనాయక్ వచ్చి ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీర శ్యాం నాయక్ కి శాలువాతో ఘనంగా సన్మానించారు.



# నేడు రాష్ట్ర గవర్నర్ జిల్లాకు రాక

**ఏర్పాట్లు పూర్తి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఈనెల 29న రాష్ట్ర గవర్నర్ జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ ఉదయం 10.35 గంటలకు సమీకృత జిల్లా కలెక్టరేట్ కు చేరుకుని 11 గంటలకు జిల్లా అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాలోని రౌట సంకేపల్లి గ్రామానికి చేరుకుని జల్ జంగల్ జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం 2026 కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ పర్యటన సందర్భంగా రక్షణ చర్యల కోసం కేటాయించిన అధికారులు, సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో తగు చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర గవర్నర్ పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా ప్రజా ప్రభుత్వం





## రాష్ట్ర మంత్రి సీతక్క

**ఉద్యమ కెరటం, ములుగు:** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఆడబిడ్డల వివాహాల సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలని, చట్టబద్ధమైన వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు జరగాలని సూచించారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, మంగపేట తహశీల్దార్ తోట రవీందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ బండారి చిరంజీవి ఆశయ సాధనకై ఉద్యమించాలి

- **ఎంసీపీఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి**

**ఉద్యమ కెరటం, హన్మకొండ:** అమరజీవి కామ్రేడ్ బండారి చిరంజీవి ఆశయ సాధనకై ఉద్యమించాలని ఎంసీపీఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి అన్నారు. దామెర మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో గురువారం కామ్రేడ్ బండారి చిరంజీవి 3వ వర్ధంతి సభను ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయన స్తూపం వద్ద గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంస రెడ్డి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మాట్లాడుతూ కామ్రేడ్ బండారి చిరంజీవి గ్రామాభివృద్ధి, అవినీతి–అక్రమాలపై పోరాటం, సమ సమాజ స్థాపన కోసం జీవితాంతం కృషి చేశారని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ, వరంగల్ జిల్లా జేఏసీ ఉద్యమాల్లోనూ ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులు ఆందోళనకరంగా మారాయని, కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం ద్వారా పేదరికం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్ల రద్దు, గ్రామీణ ఉపాధి హామీ పథకం యథాతథ అమలు, కనీస వేతనం రూ.26వేలు అమలు, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు, రాష్ట్రాల హక్కుల పరిరక్షణ, గవర్నర్ వ్యవస్థ జోక్యం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ



నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి జూన్ 7 వరకు గ్రామ, మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో ప్రజాసమస్యలపై వారం రోజుల ఆందోళనలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నీల రవీందర్, ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, బండారి చిరంజీవి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తాం

## ఎమ్మెల్యే రాగమయి దయానంద్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు ఆశయాలను కొనసాగిస్తామని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో ఎన్ టీఆర్ 103వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత అని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. ఆయన



ప్రజాసేవ, సంక్షేమ కార్యక్రమాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ..

సత్తుపల్లి పట్టణంలోని మసీద్ రోడ్‌లో నవ్య శారీస్ శ్రీను తండ్రి రేపాకుల కృష్ణారావు ఇటీవల మరణించగా, వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే కిరాణా మర్చంట్ రోడ్‌లో నారాయణపురపు వెంకటేశ్వర్లు దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు హకీమ్, దేవి స్వీట్స్ శ్రీను, ఇతర కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధిగా నిలుస్తున్న రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్

- **సామాన్యుడికి అండగా నాణ్యమైన వైద్య సేవలు**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలను అందిస్తూ ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్. గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం మెరుగైన వైద్య సేవలు పొందేలా ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. డైరెక్టర్గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రిమ్స్ ఆసుపత్రి రూపురేఖలు మారిపోయాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



కేవలం కార్యాలయానికి పరిమితం కాకుండా ప్రతిరోజూ ఉదయం జనరల్ వార్డులను స్వయంగా తనిఖీ చేస్తూ రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. "డాక్టర్లు సరిగ్గా చూస్తున్నారా.. మందులు అందుతున్నాయా" అంటూ రోగులతో ఆప్యాయంగా మాట్లాడి వారిలో ధైర్యాన్ని నింపుతున్నారు. పల్లెటూర్ల నుంచి వచ్చే ప్రజలు ఆసుపత్రిలో ఏ విభాగానికి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడకుండా సులభంగా అర్థమయ్యే విధంగా సూచిక బోర్డులు, సహాయక కేంద్రాలు, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. పేద రోగులకు ఉచితంగా మందులు, స్కానింగ్ సేవలు అందేలా కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారు. డాక్టర్ జైసింగ్ అంకితభావంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉంటూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. డాక్టర్లు, నర్సులు సమయానికి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటూ రోగుల నిరీక్షణ సమయాన్ని తగ్గించారు. అలాగే భారీ ఖర్చుతో కూడిన ఆపరేషన్లు కూడా నిరుపేదలకు ఉచితంగా రిమ్స్‌లోనే విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. "పేదవాడు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కోలుకుని సంతోషంగా ఇంటికి వెళ్లడమే మా లక్ష్యం" అని డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్ పేర్కొంటున్నారు. ఆయన సమర్థ నాయకత్వంలో రిమ్స్ ఆసుపత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు నిజమైన సంజీవనిలా మారిందని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# భరణిపాడులో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరు మండలం భరణిపాడు గ్రామంలో తెలుగు ప్రజల ఆరాధ్య నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి అభిమానులు, నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గ్రామం మొత్తం ఎన్టీఆర్ నినాదాలతో మార్మోగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్టీఆర్ అభిమానులు ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలుగు జాతికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. తెలుగు ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సినీ రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ ఎన్టీఆర్ సృష్టించిన చరిత్ర గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందపాటి శ్రీధర్ రెడ్డి, బాల రాంబాబు, మందపాటి సత్యనారాయణ రెడ్డి, బొంతు రవి, చెన్నకేశవులు, మారబోయిన రాంబాబు, కూరపాటి కృష్ణ, బొంతు హరికృష్ణ, బొంతు హరీష్, బొంతు మనోజ్, శ్రీనాథ్, బొంతు రోహిత్, బొంతు అవినాష్, మేడ మోహన్, వినయ్, బొంతు మోహన్ రావు తదితరులు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



# వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలి



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మండల సమాఖ్య కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె గురువారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉపేందర్ పాల్గొని మాట్లాడారు. 20 ఏళ్లుగా గ్రామీణ మహిళా సంఘాల అభివృద్ధికి పనిచేస్తున్న 18000 మంది వీఓఏలకు ప్రభుత్వం నెలకు కేవలం రూ.5వేల వేతనం ఇవ్వడం అన్యాయమని అన్నారు. రోజువారీ కూలీ వేతనంతో పోల్చితే వీఓఏలకు ఇచ్చే వేతనం చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భారీ రాయితీలు ఇస్తున్న సమయంలో గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న పేద మహిళా సిబ్బందికి న్యాయం చేయడంలో విఫలమవుతోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఓఏలను ఎస్ఈఆర్పీ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, సీనియర్ వీఓఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని పేర్కొన్నారు. అలాగే జీఓ 58ను రద్దు చేయాలని తెలిపారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు భీమేష్, మండల వీఓఏలు శ్రీనివాస్, దత్తు, తిరుపతి, దస్రు తదితరులు పాల్గొన్నారు.

# బాల్క సుమన్ పై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. ప్రజలను రెచ్చగొడుతూ ప్రభుత్వ, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయాలని ప్రేరేపించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపిస్తూ సీఐకి వినతిపత్రం అందజేశారు. "భవనాలు కూల్చండి, ఆఫీసులు కూల్చండి, రైల్వే పట్టాలు కోసేయండి" వంటి వ్యాఖ్యలు సమాజంలో అశాంతి, విధ్వంసానికి దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాండూర్లో ఘనంగా బక్రీద్ పర్వదిన వేడుకలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండల కేంద్రంలోని తంగళ్ళపల్లి ఈద్గా వద్ద గురువారం తాండూర్ గ్రామ జామా మజీద్ ఆధ్వర్యంలో బక్రీద్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈద్ ఉల్ అజహా ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. జామా మసీద్ ఇమామ్ అబ్దుల్ కరీం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, సమాజంలో ప్రతిఒక్కరూ కలిసిమెలిసి సోదర భావంతో జీవించాలని పిలుపునిచ్చారు. తాండూర్, తంగళ్ళపల్లి, ఐబి ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు ప్రార్థనల్లో పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తాండూర్ సీఐ ఎన్.దేవయ్య ఆధ్వర్యంలో ఎస్సై కె.ప్రసాద్, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జామా మసీద్ సదర్ అంజాదుల్లా ఖాన్, నాయబ్ సదర్ షజీఖాన్, కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆఖరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం




మంత్రి గడ్డం వివేకానంద

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల వద్ద ఉన్న ఆఖరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. గురువారం చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామని తెలిపారు. గతంలో ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, ఈసారి 28 నుంచి 32 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. చెన్నూర్, కోటపల్లి ప్రాంతాల్లో పంట ఆలస్యంగా రావడంతో జూన్ 15 వరకు కొనుగోలు కొనసాగుతుందని తెలిపారు. 2022–23లో 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి ఇప్పటివరకు 1.27 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. జూన్ 6 నాటికి మరో 30 నుంచి 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని, మొత్తం 1.60 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు జరిగే అవకాశముందని పేర్కొన్నారు. హమాలీల కొరతను అధిగమించేందుకు స్థానిక కార్మికులను వినియోగిస్తున్నామని, ధాన్యం రవాణా కోసం సింగరేణి సంస్థతో చర్చించి ఇసుక లారీలను కూడా వినియోగిస్తున్నామని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ చెన్నూర్ మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని, జైపూర్ మండలంలో మూడు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా గోదాముల్లో ధాన్యం నిల్వ చేస్తున్నామని చెప్పారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 70 శాతం కొనుగోలు పూర్తి అయిందని, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో మరో 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అంతకుముందే కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు దాదాపు 10వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకు ముందు చెన్నూర్ మండల కేంద్రంలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర భారీ వాహనాల దొంగల ముఠా అరెస్ట్

అదుపులో ముగ్గురు నిందితులు




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో హైవేల వెంట పార్క్ చేసిన భారీ వాహనాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను మావల పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్క్వార్టర్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ కేసులో మొత్తం పది మంది నిందితులు ఉండగా, ముగ్గురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. హర్యానాకు చెందిన సలీం, నఫీస్ ఖాన్, రాజస్థాన్కు చెందిన మెకానిక్ ఇంతాజ్ హుస్సేన్ అలియాస్ ఇంతియాజ్ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి వద్ద నుంచి టయోటా ఎటియోస్ కారు, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. హైవేలు, పెట్రోల్ బంకుల వద్ద నిర్మానుష్య ప్రాంతాల్లో నిలిపిన భారీ వాహనాలను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా చోరీలకు పాల్పడేదని తెలిపారు. వాహనాల అద్దాలను పగలగొట్టి, స్టీరింగ్ లాక్ను తొలగించి, ఇగ్నిషన్ వైరింగ్ ద్వారా వాహనాలను అపహరించేవారని పేర్కొన్నారు. చోరీ చేసిన ఐచర్, టిప్పర్ వంటి భారీ వాహనాలను మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు తరలించి, ఒక్కరోజులోనే విడిభాగాలుగా చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులపై మావల, గుడిహత్నూర్, శంషాబాద్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే కేసులు నమోదయ్యాయని తెలిపారు. బుధవారం రాత్రి మావల బైపాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న కారును వెంబడించి ఈ ముఠాను పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా జ్యుడీషియల్ రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఏడుగురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సైబర్ సెల్, సాంకేతిక బృందం, మావల, ఆదిలాబాద్ రూరల్ పోలీస్ సిబ్బంది, సహకరించిన మధ్యప్రదేశ్ పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, మావల సీఐ ప్రేమ్ కుమార్, డబ్ల్యూపీఎస్ ఇన్స్పెక్టర్ కె.ఫణిధర్, రూరల్ ఎస్సై వి.విష్ణువర్ధన్, ఎస్సై శ్రీకాంత్, ఐటీ కోర్ ఆర్ఎస్సై గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో ఘనంగా బక్రీద్ వేడుకలు


**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం గ్రామంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో ముస్లిం భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచే మసీదు ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు కొత్త దుస్తులు ధరించి నమాజ్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇమామ్ మాట్లాడుతూ శాంతి, సౌభ్రాతృత్వం, మానవత్వం ప్రతిఒక్కరి జీవితంలో ముఖ్యమని సందేశం ఇచ్చారు. దేశంలో సుఖశాంతులు నెలకొనాలని, ప్రజలందరూ ఐక్యంగా జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. బక్రీద్ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇంటింటా ప్రత్యేక వంటకాలు సిద్ధం చేసి బంధుమిత్రులకు ఆతిథ్యం ఇచ్చారు. పేదలకు ఆహార పదార్థాలు, దుస్తులు పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ బక్రీద్ త్యాగానికి ప్రతీక అని, మానవ సేవే నిజమైన ధర్మమని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవభావంతో కలిసి జీవించడం ద్వారా సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని అన్నారు.

# బోథ్ ప్రజలకు ఆడే గజేందర్ బక్రీద్ శుభాకాంక్షలు

**ఉద్యమ కెరటం, బోథ్:** త్యాగానికి, లౌకికత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ దైవప్రవక్త ఇబ్రహీం చూపిన త్యాగనిరతి, దైవభక్తిని గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. స్వార్థాన్ని విడిచిపెట్టి తోటి మానవుల పట్ల కరుణ, దయ కలిగి ఉండటమే ఈ పండుగ ఇచ్చే గొప్ప సందేశమని అన్నారు. బోథ్ నియోజకవర్గంలో హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మతం ఏదైనా మనం పీల్చే గాలి, తాగే నీరు ఒక్కటేనని, తరతరాలుగా కొనసాగుతున్న గంగా–జమునా తెహజీబ్, మతసామరస్యాన్ని ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఒకరి పండుగల్లో మరొకరు భాగస్వామ్యులవుతూ సోదరభావంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో నిజమైన శాంతి నెలకొంటుందని చెప్పారు. ఈ బక్రీద్ పండుగ ప్రతి ఇంట్లో ఆనందం, నియోజకవర్గంలో శాంతి సౌఖ్యాలను నింపాలని ఆకాంక్షించారు.



# ముస్లింలకు సర్పంచ్ బొడ్డు దత్తాత్రి బక్రీద్ శుభాకాంక్షలు



**ఉద్యమ కెరటం, సిరికొండ:** ముస్లిం సోదరులకు సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాలు, కులాల కలయికే భారతదేశం ప్రత్యేకత అని కొనియాడారు. బక్రీద్ పండుగ కేవలం ఒక ఆచారం మాత్రమే కాకుండా, త్యాగం, ప్రేమ, దానం, సానుభూతి వంటి గొప్ప విలువలను చాటిచెప్పే పర్వదినమని పేర్కొన్నారు. మనసులోని స్వార్థాన్ని వీడి ప్రేమను పంచుతూ మనుషులను దగ్గర చేసే సందేశమే బక్రీద్ అని అన్నారు. ఈ పండుగ ప్రతి ఇంట్లో శాంతి, ఆనందం, ఐశ్వర్యాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. త్యాగంతోనే తృప్తి, దానంతోనే దీవెనలు లభిస్తాయని, మనం చేసే ప్రతి మంచి పని జీవితాన్ని ప్రకాశవంతం చేస్తుందని తెలిపారు. బక్రీద్ పండుగ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# షేక్ ఇమామ్ ఇంటా బక్రీద్ విందు

**ఉద్యమ కెరటం, సిరికొండ:** బక్రీద్ పండుగను పురస్కరించుకుని డీసీసీ జిల్లా కార్యదర్శి షేక్ ఇమామ్ ఆహ్వానం మేరకు ఆయన నివాసంలో గురువారం విందు భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ పటేల్, ఆర్.మల్లేష్, సత్తయ్య గౌడ్, ప్రభాకర్ పటేల్, ఆర్.ప్రవీణ్ కుమార్, గొర్ల సతీష్, రుయ్యాడి గంగాధర్ తదితరులు పాల్గొని షేక్ ఇమామ్కు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశం అన్ని మతాలు, కులాల కలయికకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. 'హిందూ ముస్లిం భాయి భాయి' అనే సోదరభావాన్ని బక్రీద్ పండుగ మరింత బలపరుస్తుందని అన్నారు.



# ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఈద్–ఉల్–అద్హా పర్వదినాన్ని పురస్కరించుకొని ఖదీమ్ ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నమాజ్కు హాజరైన ముస్లిం సోదరుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈద్గా ప్రాంగణంలో శుభ్రత, తాగునీటి సదుపాయం, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా మౌలానా కబీర్ సాహెబ్ గత రెండు రోజులుగా రాత్రింబవళ్లు శ్రమించి ఈద్గా ఏర్పాట్లను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించినట్లు కమిటీ సభ్యులు అభినందించారు. ఈద్గా కమిటీ ట్రెజరర్ సిఫీ అఫ్జల్ సాహెబ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఈద్గా నిర్వహణ కోసం రూ.27,500 చందా సేకరించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈద్ నమాజ్ను మౌలానా ఇంతెఖాబ్ ఆలం సాహెబ్ నిర్వహించగా, అనంతరం ఖుత్బా అందించారు. వేలాది మంది ముస్లింలు ఈద్గా వద్ద నమాజ్లో పాల్గొని పరస్పరం ఈద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈద్గా కమిటీ తరఫున ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, షహీన్ సుల్తానాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రైతుల కోసం కొత్త టోకెన్ కేంద్రాలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మార్కెట్కు వచ్చే రైతులకు టోకెన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి గురువారం రెండు నూతన టోకెన్ కేంద్రాలను ప్రారంభించారు. మార్కెట్లో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని రైతులు టోకెన్ల కోసం ఎక్కువసేపు నిరీక్షించకుండా ఉండేందుకు ఈ అదనపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త టోకెన్ కేంద్రాల ఏర్పాటుతో టోకెన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా కొనసాగిందని పేర్కొన్నారు. రద్దీ కారణంగా మార్కెట్కు వచ్చిన రైతులు ఎవరూ ఇబ్బంది పడకుండా, సులభంగా టోకెన్లు పొందగలిగారని తెలిపారు. రైతుల అవసరాలను గుర్తించి సకాలంలో స్పందించి అదనపు టోకెన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు మార్కెట్ కమిటీ కృషి చేస్తుందని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి వివరించారు.

# డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్కు ఘన సత్కారం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ను మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షులు గాడేకర్ పరశురాం, బొసార గ్రామ సర్పంచ్ గోట్ముఖలే సుభాష్, కాంగ్రెస్ నాయకులు సౌన్ కాంబ్లె దీపక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాంగ్ సమాజ్ సమస్యలు, యువత ఉపాధి అవకాశాలు, విద్యా సదుపాయాలు, గ్రామీణ ప్రాంత మౌలిక వసతులపై విస్తృతంగా చర్చించారు. డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. మాంగ్ సమాజ్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

